
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 3

మంగళవారం 7 అక్టోబరు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

కుండపోత వర్షం



ముత్యాలపాడులో నీట మునిగిన మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌కు ఎత్తుతున్న రైతులు



చాగలమర్రిలో మొక్కజొన్న ధాన్యంపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు



తడిచిన మొక్కజొన్నలను ట్రాక్టరు సాయంతో బయటకి తరలిస్తున్న దృశ్యం



గొట్లూరులో కందిపంటలో నిలిచిన వర్షపు నీరు



నల్లమల అటవీ తీరంలో రహదారిపై వర్షం నీటిలో కొట్టుకు పోతున్న మొక్క జొన్నలు

తడిచి ముద్దయిన మొక్కజొన్నలు



ఎంతో ఆశతో మొక్కజొన్న సాగు చేశా. వర్షం రూపంలో వెంటాడింది. కోతలు కోయించి కుప్పలు వేసిన మొక్క జొన్నలు తడిచి ముద్దయ్యాయి.

● వెంకటేశ్వర్లు, రైతు, టి.లింగందిన్నె

మొక్కజొన్న పంట వర్షార్పణం

- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- స్తంభించిన రాకపోకలు
- చాగలమర్రిలో 75.2 మి.మీ వర్షపాతం నమోదు
- రూ.20కోట్లు నష్టం.. ఆందోళనలో రైతాంగం

రుద్రవరం/ చాగలమర్రి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం, చాగలమర్రి మండలాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షంతో వాగులు, వంకలు, వక్కిలేరు పొంగి ప్రవహించాయి. ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, దేవాలయాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రాకపోకలు స్తంభించాయి. రుద్రవరంలో 70.2. మి.మీ, చాగలమర్రిలో 75.2 మి.మీ వర్షపాతం నమోదైంది. నల్లమల అటవీ తీరంలో సైతం భారీ వర్షం కురిసింది. మొక్కజొన్న పంట కోత కోసి ఆరబెట్టుకున్న ధాన్యం నీట మునిగి దెబ్బతినింది. రుద్రవరం మండలంలో 12,625 ఎకరాల్లో మొక్కజొన్న ఖరీఫ్ సీజన్‌లో సాగు చేశారు. ముకుందాపురం, ఆలమూరు, ముత్తలూరు, నల్లవాగుపల్లె, టి.లింగందిన్నె, చిత్తరేణిపల్లె, కొండమా యల్లె, వెల గలపల్లె, కోటకొండ, యల్లావత్తుల, శ్రీరంగాపురం, డి.కొట్టాల గ్రామాల పరిధిలో మొక్కజొన్న రైతులకు భారీ నష్టం జరిగింది. లక్ష క్వింటాళ్లకు రూ.2వేల చొప్పున రూ.20 కోట్లు నష్టం వాటిల్లింది. ముత్యాలపాడు, శెట్టివీ డు, చాగల మర్రి గ్రామాల్లోని రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం పట్టాలు కప్పినా కప్పిన భారీ వర్షానికి నీట ముని గింది. 90 క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం నీట మునగడంతో ఆందోళనకు గురైన రైతు దస్తగిరి అస్వస్థతకు గురై వైద్యశా లలో చికిత్స పొందుతున్నాడు. నేలంపాడు, గొట్లూరు, రాంపల్లే, మల్లేవేముల గ్రామాల్లో ఖరీఫ్‌లో సాగు చేసిన బెండ, మినుము, జూట్, మొక్కజొన్న, కంది పంటలు నీటమునిగి రైతులకు నష్టం కలిగించింది. దాదాపు 2వేల ఎకరాల దాక పంటలు దెబ్బతినడంతో రైతులను కుదేలు చేసింది. అహోబిళ క్షేత్రం సమీపంలోని మఠంవారి చెరువు అలుగు పొంగి ప్రవహించడంతో చాగలమర్రి మండలంలోని తోడేళ్లపల్లె, ముత్యాలపాడు గ్రామాలు జలదిగ్బంధంలో ఉండి పోయాయి. వరద నీరు గ్రామాల్లో ప్రవేశించడంతో ప్రజలు భయాందోళన చెందారు. దీంతో ప్రజలు రాత్రంతా జాగరణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



శెట్టివీడులో ..

ప్రభుత్వం ఆదుకోవాలి



వర్షంతో మొక్కజొన్నలు తడిచి నష్టపోయాయి. ప్రభుత్వమే పరిహారం అందించి ఆదుకోవాలి. ప్రతి ఏడాది వర్షం రైతులను వెంటాడుతుంది.

- శివనారాయణ, రైతు, టి.లింగందిన్నె

తీవ్రంగా నష్టపోయాం



అకాలంగా వర్షం కురియడంతో తీవ్రంగా నష్టపోయాం. నాలుగెకరాల్లో మొక్కజొన్న సాగుచేసి కోత కోయించి కుప్పలు ఉంచాం. ఒక్కసారిగా వర్షం కురియడంతో పొలంలో నీటిలో కొట్టుకు పోయింది. ● సుభాష్, రైతు, టి.లింగందిన్నె

సత్వరమే న్యాయం చేయండి

- అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు
- పీజీఆర్ఎస్‌కు 66 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు

నంద్యాల టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 66 ఫిర్యాదులు వచ్చినట్లు ఏఎస్పీ తెలిపారు. ఉద్యోగం ఇప్పిస్తామని తమ వద్ద నుంచి రూ.3.8లక్షలు తీసుకుని సంతోష్, మధు అనే వ్యక్తులు మోసం చేశారని బొల్లవరం గ్రామానికి చెందిన స్వాములు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. 2021 సంవత్సరంలో పాతమడుగుల వద్ద రెండెకరాల పొలాన్ని రూ.8 లక్షలకు లక్ష్మి, నరసయ్య, మద్దిలేటి, కస్తూరయ్య, మధుబాబు అనే వ్యక్తులు అమ్మారని, అయితే అదే పొలాన్ని వేరే వారికి కూడా అమ్మి తనను మోసంచేశారని పాతమడుగలకు చెందిన పుల్లయ్య ఫిర్యాదు చేశారు. నంద్యాల వైఎస్ఆర్ నగర్‌లో ఉండే బ్రహ్మానందరెడ్డి అనే వ్యక్తి కారు బాడుగకు అని తీసుకెళ్లి బాడుగ, కారు ఇవ్వకుండా తను ఇబ్బందులకు గురి చేస్తున్నారని శ్రీనివాస రెడ్డి అర్జీ సమర్పించారు. సీఐలు జయరాములు, ఇస్మాయిల్, పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9 నుంచి మండల స్థాయి ఎస్జీఎఫ్ ఎంపికలు: డీఈవో

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. కో ఆర్డినేటర్లు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్‌బాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను ఈనెల 18నుంచి 20వరకు డివిజన్ స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపాలన్నారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన వారి జాబితాను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు బీహెచ్ విశ్వనాథ్, జి.ఆశాజ్యోతిలకు పంపాలని డీఈవో ఆదేశించారు.

నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించండి

- ఫీడ్ బ్యాక్ స్వీకరణ వేగవంతం చేయాలి
- కలెక్టర్ రాజకుమారి



నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌హాల్లో డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులు అర్జీలు స్వీకరించారు. అంతకుముందు కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన ప్రతి అర్జీని జాగ్రత్తగా చదివి సరైన రీతిలో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సిన 2,017, రీ ఓపెన్ అయిన 539 దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఫీడ్ బ్యాక్ స్వీకరణ తక్కువ శాతం ఉందని, వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. రేషన్ బియ్యం తక్కువగా ఇస్తున్నారని డోన్ మండలం నక్కవాగులపల్లెకు చెందిన డీలర్ చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. తన పరిధిలో మొత్తం 320 మంది కార్డుదారులున్నారని, 45 క్వింటాళ్లకు గానూ కేవలం 32 క్వింటాళ్ల మాత్రమే వస్తున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. గోస్పాడు మండలం పసురపాడు గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఆనందరావుకు ఐదేళ్ల నుంచి పింఛన్ రావడం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల కిందట పక్షవాతం వచ్చి ఒక చెయ్యి, ఒక కాలు పనిచేయడం లేదు. అప్పటి నుంచి పింఛన్‌కు దరఖాస్తులు ఇస్తున్నా పింఛన్ రావడం లేదని ఫిర్యాదు చేశారు. గోస్పాడు మండలంలో యాళ్లూరు గ్రామానికి చెందిన పల్లవి కడపలోని క్రిసెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ(నర్సింగ్) థర్డ్ ఇయర్ చదువుతోంది. తనకు రెండేళ్లకు స్కాలర్‌షిప్ రావడం లేదని, రూ.56వేల వరకు రావాల్సి ఉందని కలెక్టర్ ఫిర్యాదు చేసింది. తల్లిదండ్రులకు ఫీజు కట్టే స్తోమత లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నానని, తన సమస్యను పరిష్కరించాలని ఆమె వేడుకుంది.

స్మార్ట్ కార్డులు వచ్చేశాయ్..!



రేషన్ పంపిణీలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఏటీఎం కార్డు తరహాలో స్మార్ట్ రేషన్ కార్డులను తయారుచేసింది. జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లాకు కొత్తగా 7,598 రేషన్ కార్డులు వచ్చినట్లైంది. తద్వారా ఎన్నో ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న ఆయా వర్గాల కష్టాలు తప్పినట్లైంది. డిజిటల్ కార్డులను పక్కాగా రూపొందించారు. దీని సమగ్ర వివరాలను పొందుపర్చారు. ఇదే క్రమంలో ఆయా కొత్త, పాత రేషన్ కార్డుదారుల్లో సైతం ఆనందోత్సవం మొదలైంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

- అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట
- జిల్లాకు 5,32,570 కార్డులు మంజూరు
- ఇందులో కొత్తవి 7,598 కార్డులు
- పంపిణీ చేస్తున్న అధికారులు
- ఆనందంలో కార్డుదారులు

నంద్యాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చేశాయి. గతంలో ఉన్న పాత రేషన్‌కార్డులను సైతం మార్పు చేసి స్మార్ట్ కార్డు (డిజిటల్)లను ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాకు 5,32,570 డిజిటల్ స్మార్ట్ కార్డులు వచ్చాయి. జిల్లా అధికార యంత్రాంగం ఎక్కడిక్కడ ఆయా రేషన్‌కార్డు దారులకు సదరు కార్డులను అందించే దిశగా ఆదేశాలు జారీ చేసింది. ఆయా అధికారులు సైతం ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. ఏటీఎం కార్డు తరహాలో స్మార్ట్ రేషన్ కార్డు ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇదే క్రమంలో రేషన్ సరుకులు కూడా పక్కదారి పట్టకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లైంది.

గతం కంటే ఎక్కువగా...

గత ప్రభుత్వ హయాంలో అధికార లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 5,24,972 రేషన్ కార్డులుండగా..

మిగతా 6వ పేజీలో



శిరివెళ్లలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రతి పల్లెలోనూ బీజేపీ జెండా ఎగరాలి

రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

మట్టిమిద్దె కూలి చిన్నారి మృతి

• త్రుటిలో తప్పించుకున్న కుటుంబ సభ్యులు
• మాధవరం గ్రామంలో ఘటన

5

శ్రీశైలం నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

- నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు



ఒక గేటుతో నీటి విడుదల

శ్రీశైలం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం వరద ప్రవాహం తగ్గడంతో గేట్లను ఇంజనీర్లు మూసివేశారు. సోమవారం మళ్లీ వరద ఉధృతి పెరగడంతో మరోమారు ఒక క్రస్ట్‌గేటును 10 అడుగుల మేర ఎత్తి 28,075 క్యూసెక్కులు సాగర్‌కు వదిలారు. డ్యాం నీటిమట్టం 885 అడుగులుగా, నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలుగా నమోదైంది. జూరాల స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి 1,19,613 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తరువాత 62,645 క్యూసెక్కులు విడుదల చేశారు.

చెత్తరహిత జిల్లాగా మార్చుదాం: కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే మూడు నెలల్లో జిల్లాను చెత్తకుప్పలు లేని జిల్లాగా మార్చుకుందామని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం పీజీఆర్ఎస్ హాల్లో స్వచ్ఛాంధ్ర అవార్డు- 2025 జిల్లాస్థాయి బహుమతుల ప్రదానోత్సవంలో ఆమె పాల్గొన్నారు. నంద్యాల జిల్లాను శుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం చాలా ముఖ్యమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార ప్రదేశాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని క్రమంగా అమలు చేసి, తర్వాత దాన్ని జిల్లావ్యాప్తంగా విస్తరింపజేయాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర అవార్డు జిల్లాకు లభించడం గర్వకారణమన్నారు. వివిధ విభాగాల్లో మొత్తం 51 అవార్డులు సాధించిన నిర్వాహకులకు రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన జ్ఞాపికలు, సర్టిఫికెట్లు కలెక్టర్ అందజేసి శాలువాలతో సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీపీవో లలితాబాయి, డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డోన్ మున్సిపల్ చైర్మన్ రాజేశ్, నంద్యాల ఎంపీపీ ప్రభాకరరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ జీఎస్టీ 2.0 ఫలాలు..!

- 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరిట అవగాహన
- 16న కర్నూలులో 3 లక్షల మందితో భారీ సభ
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ హాజరు
- మూడు స్థలాలు పరిశీలించిన మంత్రుల బృందం
- ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష





సమీక్షలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు

కర్నూలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో తగ్గిన జీఎస్టీతో ఇంటింటికీ జీఎస్టీ2.0 ఫలాలు చేరుతున్నాయి. తగ్గింపు జీఎస్టీ ప్రయోజనాలు, సంస్కరణలపై విస్తృత ప్రచారం చేయడంతో పాటు ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించేందుకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరిట వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో భాగంగానే ఈ నెల 16న కర్నూలులో మూడు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. దేశంలోనే ఇది తొలి సభ. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సభను నిర్వహిస్తోంది. మూడు లక్షల మంది హాజరయ్యేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. సభా స్థలం ఎంపికపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సారథ్యంలో మంత్రులు, ప్రజాప్రతినిధుల బృందం సోమవారం మూడు స్థలాలను పరిశీలించారు.



మాట్లాడుతున్న మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ

మూడు లక్షలలో భారీ సభ

ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలు, ప్రయోజనాలపై ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కర్నూలు నగరంలో ఈ నెల 16న మూడు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సహా కూటమి ముఖ్య నేతలు పాల్గొనే ఈ సభ ఏర్పాటుకు నన్నూరు టోల్ ప్లాజా వద్ద, రాగమయూరి వెంచర్, ఓర్వకల్లు సమీపంలో జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమ వద్ద మూడు స్థలాలను రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి పరిశీలించారు.

మిగతా 4వ పేజీలో

అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



అంధుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని అరుణభారతి సంస్థ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పిలుపునిచ్చారు. తన తల్లిదండ్రులు, బీసీ గురెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం ప్రారంభించిన పింఛన్ల పంపిణీకి 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం బనగానపల్లె పాత బస్టాండ్ సమీపంలోని బీసీ గుర్రెడ్డి కాంప్లెక్స్ ఆవరణంలో అంధులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులతో పాటు సోదరుడు బీసీ బాలతిమ్మారెడ్డికి నివాళులర్పించిన అనంతరం బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ 2009నుంచి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అంధులకు ప్రతి నెలా ఒకటో తేదీన 160 మందికి రూ.500 చొప్పున తన సొంత నిధులతో పింఛన్లు అందజేస్తున్నానన్నారు. 17వ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ఈ నెల నుంచి 200 మంది అంధులకు మరో రూ.200 పెంచి రూ.700 పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు. అంధులను ఎవరూ చిన్నచూపు చూడకూడదని, అంధులు, దివ్యాంగులను గౌరవించాలన్నారు. ప్రస్తుతం డబ్బుకోసం పరుగెడుతూ మానవ సంబంధాలు దూర మవుతున్నాయన్నారు. అంధులకు మనోధైర్యం ఉంటుందని, వారు ఆత్మవిశ్వాసంతో బ్రెయిలీలిపితో ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాల సంపాదించాలని ఆకాంక్షించారు. ఎంతో మంది పట్టుదలతో చదివి ఐఏఎస్‌లు అయ్యారన్నారు. హైదరాబాద్‌కు చెందిన గొల్ల శ్రీకాంత్ అమెరికాలో చదివి రూ.300కోట్ల సామ్రాజ్యానికి అధిపతి అయి ఎంతోమందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బనగానపల్లె మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ కులమత, ప్రాంతాలకు అతీతంగా బీసీ రాజారెడ్డి సొంత నిధులు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. అనంతరం అంధులు, వారి సహాయకులకు భోజనవసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గజల్ కళాకారుడు మహమ్మద్‌మియా, రిటైర్డు ఉపాధ్యాయుడు మద్దిలేటి, బొబ్బల మహేశ్వరరెడ్డి, బలరాం, భరతుడు, ఉపసర్పంచ్ బురానుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

యాగంటీశ్వరుని సేవలో దక్షిణ కొరియా వాసులు



యాగంటీశ్వరుడిని దర్శించుకున్న దక్షిణ కొరియా వాసులు

బనగానపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామివారిని సోమవారం దక్షిణ కొరియా దేశస్థులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వారు భారతదేశంలోని పలు ప్రాంతాలను సందర్శిస్తున్న క్రమంలో యాగంటి బసవయ్య, ఉమామహేశ్వరున్ని దర్శించుకున్నారు. వీరికి యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే యాగంటి ఆలయాభివృద్ధికి ప్యాపిలికి చెందిన కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.10వేలు విరాళం అందించారు.

మహానందీశ్వరుని సన్నిధిలో ప్రముఖులు



పూజలు నిర్వహించి వస్తున్న జెన్ కో చీఫ్ ఇంజనీర్ తిరుమల ప్రసాద్

మహానంది, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. బెంగళూరు అడిషనల్ ఎస్పీ దీపక్, జెన్‌కో చీఫ్ ఇంజనీర్ తిరుమల ప్రసాద్ స్వామివారిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వారిక అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. అలంకార మంటపంలో వేదపండితులు వీరిని ఆశీర్వదించి, కండువాతో సత్కరించారు. వీరివెంట మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, కానిస్టేబుల్ శేషన్న ఉన్నారు.

సర్దార్ నాగప్ప సేవలు చిరస్మరణీయం

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



సర్దార్ నాగప్ప చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ తదితరులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు తొలి శాసన సభ్యుడు, రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా సర్దార్ నాగప్ప, స్వాతంత్ర సమర యధురాలిగా ఆయన సతీమణి అమరావతమ్మ అందించిన సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ నాగప్ప జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ, సర్దార్ నాగప్ప జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ సర్దార్ నాగప్ప రాజ్యాంగ పరిషత్ సభ్యునిగా మన రాజ్యాంగ నిర్మాణంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన వారసుడిగా దామోదరం సంజీవయ్యను రాజకీయాల్లోకి తెచ్చారన్నారు. జిల్లా మొత్తం గర్వించదగిన నాయకుడిగా వారు చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షుడు జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, వేదిక సభ్యులు జేవీ కృష్ణయ్య, శేషయ్య, పెరికల రంగస్వామి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య, మాజీ మేయర్ బంగి అనంతయ్య, కేసీ కల్కూర, జేఎస్‌ఆర్‌కే శర్మ, ఇనయతుల్లా, డా.పార్వతి, క్రిష్టఫర్, సర్దార్ నాగప్ప కుటుంబ సభ్యులు, దళిత సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాలన అస్తవ్యస్తం



క్లస్టర్ వర్సిటీ నిర్మాణంలో ఉన్న భవనం

- ● ఆర్‌యూలో పడకేసిన ఉన్నత విద్య
- ● మసకబారుతున్న వర్సిటీల మనుగడ
- ● రాజకీయాలకు ఆజ్యం పోస్తున్న ప్రొఫెసర్లు
- ● ఏసీ గదులకు పరిమితమైన పర్యవేక్షణాధికారులు
- ● క్లస్టర్‌లో అటకెక్కిన వైసీపీ నేత వ్యవహారం? ● కలెక్టర్ దృష్టి సారించాలంటున్న విద్యార్థి సంఘాలు
- ● ఆధిపత్య, అంతర్గత పోరులతో నలిగిపోతున్న విద్యార్థులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు యూని వర్సిటీల్లో ఉన్నత విద్య పడకేసింది. విద్యార్థుల చేరికలపై ప్రచారం లేదు.. కోర్సులపై అవగాహన కల్పించే దిక్కే లేకపోవడంతో చేరికలు పడిపోయాయి. ప్రొఫెసర్ల మధ్య ఆధిపత్య, అంతర్గత పోరులో ఉన్నత చదువులు నలిగిపోతున్నాయని పేద విద్యార్థులు ఆవేదన చెందుతు న్నారు. దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేక ఉపాధి కోర్సులతో ఏర్పాటైన క్లస్టర్ వర్సిటీకి 55ఎకరాల్లో రూ.86కోట్లతో నిర్మించిన భవనాలు ఉండి కూడా వాటిని స్వాధీనం చేసుకో లేకపోతుంది. డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతోంది. కొత్తగా వచ్చిన కలెక్టర్ దృష్టి సారించి గాడిలో పెట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒకేషనల్ కోర్సు, స్కిల్ డెవలప్‌మెంట్, బేసిక్, ప్రొఫెషనల్ కోర్సులు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంగా ఏర్పాటైన అన్ని వర్సిటీల్లో ఒకే బేసిక్ కోర్సులుండటంతో విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది.

జిల్లాలోని మూడు యూనివర్సిటీల్లో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నత చదువులు.. పాలన అంశాల కంటే కూడా ఇక్కడ రాజకీయాలు ఎక్కువయ్యాయి. ప్రొఫెసర్లు, ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పాలన అంతా ఏసీ గదులకే పరిమితమైంది. స్థానిక ప్రొఫెసర్లు పదవుల కోసం కొట్లాడుకోవడం.. విద్యార్థులను పావులుగా వాడుకుంటున్నారు. వారికి చదువుకు బదులు.. రాజకీయాలు నేర్పుతున్నారు. మరికొందరు ప్రొఫెసర్లపైన ఫైళ్ల చోరీ, సీఐడీ, విజిలెన్స్ కేసులున్నాయి. ఇవన్నీ వెరసి వర్సిటీల్లో చదువులు, పాలన మసకబారుతోందనే విమర్శలున్నాయి.

వైసీపీ ప్రభుత్వం ఒక్కపైసా..

రాష్ట్ర విభజన తర్వాత మైనార్టీల కోసం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని కర్నూలులో ఏర్పాటుచేశారు. 2016 నుంచి అద్దె భవనంలో నడుస్తోంది. డిగ్రీ-4, పీజీ- 9 కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఓర్వకల్లు సమీపంలో 2017లో 149 ఎకరాల్లో రూ.18కోట్ల నిధులు కేటాయించగా కేవలం రూ.5కోట్లు అప్పటి టీడీపీ ప్రభుత్వం విడుదల చేసింది. గత వైసీపీ పాలనలో ఒక్క పైసా నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటి నిర్మాణాలపై ఆరా తీస్తోంది.

అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు

ఉర్దూ యూనివర్సిటీ ప్రస్తుతం అద్దె భవనానికి ప్రతినెల రూ.2.63లక్షలు బాడుగ చెల్లించలేక ఇబ్బందులు పడుతోంది. సకాలంలో అద్దె చెల్లింపులు లేకపోవడంతో బిల్డింగ్ యాజమాని ఖాళీ చేయాలంటూ లీగల్ నోటీసులు కూడా ఇచ్చారని విద్యార్థులు వాపోతున్నారు. వర్సిటీ ఉన్నతాధికారులు ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గదులు కేటాయించాలని ఉన్నత విద్యామండలిని ఆశ్రయించింది. క్లస్టర్ వర్సిటీ అధి కారులు అందుకు ససేమిరా అన్నారు. అద్దె భవనంలోనే అరకొర వసతులతో విద్యా ర్థులకు సరైన రక్షణలేని భవనంలోనే కొనసాగుతోంది. వర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి వంద శాతం అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిచేశారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా సౌకర్యాలు, వసతులు లేక అధికారులు, విదార్థులు తల్లడిల్లిపోతున్నారు.

కలెక్టర్ గాడిలో పెట్టాలి

కలెక్టర్ ఉన్నతవిద్యను గాడిలో పెట్టాలి. పేద విద్యార్థుల సంక్షేమం కోసం జిల్లాలో మూడు యూనివర్సిటీలు కోట్ల నిధులతో ఏర్పాటు చేశారు. సమర్థులైన అధికారులను నియమించకపోవడంతో లక్ష్యం దారి తప్పుతోంది. ఫలితంగా ఉన్నత విద్య కోసం విద్యార్థులు ఇతర జిల్లాలకు వేళ్లే పరిస్థితులు జిల్లాలో దాపురించాయి. వనరులను సక్రమంగా వినియోగించుకునే దిశగా కలెక్టర్ దిశానిర్దేశం చేయాలి.

● రాగిరి చంద్రప్ప, రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్

కేసులతో ముడిపడి..

ఇటీవల పాలకమండలిలో కోర్టు కేసులతో ముడిపడి ఉన్న పలు వివాదాస్పద అం శాలు వర్సిటీకి చెడ్డపేరు తెచ్చిపెడుతున్నాయి. ఉన్నత విద్యామండలి కూడా ఇందుకు వత్తాసు పలకడం. అడ్డగోలు నిర్ణయాలను ప్రశ్నించకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తాయిలాలు ప్రకటించి ప్రశ్నించే గొంతు లేకుండ.. అన్ని తానై వ్యవహ రించడంలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి పన్నిన వ్యూహం ఫలించడంపై ప్రస్తుతం క్యాంపస్‌లో చర్చనీయాంశమైంది. ప్రశ్నించాల్సిన విద్యార్థి సంఘాల మనుగడ లేకపోవడంతో ఉన్నతాధికారుల తీరుపై విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో..

రూ.86కోట్లతో క్లస్టర్ వర్సిటీకి నగర శివారులోని జగన్నాథగట్టుపై 55ఎకరాల్లో నిర్మిం చారు. వైసీపీ పాలనలో నిర్మాణాల్లో అవకతవకలు జరి గాయనే ఆరోపణలతో కూటమి ప్రభుత్వం నిర్మాణాలను నిలిపేసింది. ఏపీఎంఐడీసీ అనే ప్రభుత్వ సంస్థ పేరుతో నిర్మాణాలు ఎందుకు చేపట్టారనే కోణంలో ప్రభుత్వం ప్రశ్నించింది. విచారణకు ఆదేశిం చాలని హడావుడి చేసింది. ప్రస్తుతం ఆఊసులే లేకుండాపోయింది. ఫలితంగా సిల్వర్ జూబ్లీ కళాశాలలో తాత్కాలికంగా వర్సిటీ నడుస్తోంది. మార్చి 2021లో ప్రతేక కోర్సులతో క్లస్టర్ యూనివర్సిటీ ఏర్పాటైంది. ఇప్పటి వరకు పనిచేసిన ఉపకులపతి, రిజిస్ట్రార్ల పదవీ కాలం పూర్తికావడంతో వారిని మాతృ సంస్థలకు ప్రభుత్వం పంపింది. ప్రస్తుతం సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల లను క్లస్టర్ వర్సిటీలో చేర్చారు. గతంలో పనిచేసిన అధికారులు రాజకీయాలు, కక్ష సాధింపులకే ప్రాధాన్యత ఇచ్చారనే విద్యార్థులు ఆరోపిస్తున్నారు. భవనాలు ప్రారంభానికి నోచుకోక పోగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మరోవైపు వర్సిటీని రద్దు చేస్తారంటూ ప్రచారం ఉందని విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ రాజకీయ నేతకు.. ఓ మాజీ మంత్రికి ఆశీస్సులుండటంతో ఫైలు ఇంచి కూడా ముందుకు కదలడం లేదని కొందరు ప్రొఫెసర్ల వద్ద ఓ ఉన్నతాధికారి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

సమర్థవంతమైన పాలన లేక..

ఆర్‌యూ(రాయలసీమ యూనివర్సిటీ)లో వనరులు, సౌకర్యాలు ఉన్నప్పటికి సమర్థవంతమైన పాలన లేదు. ఏళ్ల తరబడి కోట్ల నిధులు పక్క దారి పట్టడమే కాక, విజిలెన్స్, సీఐడీ కేసులు, అక్రమాలు, ఆందోళనతో రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చుకుంది. గాడిన పెట్టాల్సిన ఉన్నత విద్యామండలి సైతం రాజకీయ జోక్యంతో చేతులు ఎత్తేసింది. వర్సీటీకి 2008లో 285 ఎకరాలు భూములు కేటాయించినా కొంతమేర భూములు అన్యాక్రాంతమయ్యాయనే ఆరోపణలున్నాయి. 2024 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీలో 16కోర్సులకు విద్యార్థుల సంఖ్య 310కి పడిపోయింది. ఉపకులపతులు పేరుకు మాత్ర మే తమ పదవిని అనుభవించి పోతున్నారే తప్ప అభివృద్ధి జాడ ఎక్కడ కనిపించడం లేదని విమర్శలున్నాయి.



అద్దె భవనంలో కొనసాగుతున్న ఉర్దూ యూనివర్సిటీ

ఇంటింటికీ జీఎస్టీ 2.0 ఫలాలు..!

(3వ పేజీ తరువాయి)

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, బీద రవిచంద్ర, ప్రధానమంత్రి కార్యక్రమాలు స్పెషల్ కో-ఆర్డినేటర్ వీరపాండియన్, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డాక్టర్ ఎ.సిరి, రాజకుమారి, ఎస్పీలు విక్రాంత్ పాటిల్, సునీల్ షెరాన్, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, గౌరు చరిత, భూమా అఖిలప్రియ, కేఈ శ్యాంబాబు, డాక్టర్ పార్థసారథి, బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏ.రామకృష్ణ తదితరులు పరిశీలించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ భద్రత, ఉమ్మడి కర్నూలు, నంద్యాల సహా రాయలసీమ జిల్లాల నుంచి తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా, సభ దిగ్విజయం చేసేలా మూడు స్థలాలను పరిశీలించారు. చివరికి రాగమయూరి వెంచర్ ఎంపిక చేశారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష

ఈ నెల 16న ప్రధాని మోదీ సభను దిగ్విజయం చేయడం, జన సమీకరణ, భద్రత, బందోబస్తు, రూట్ మ్యాప్‌పై స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాకు చెందిన ఎంపీ, ఎమెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. దాదాపు గంటకు పైగా జరిగిన సమావేశంలో సభా నిర్వహణపై పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గాల వారిగా జన సమీకరణపై కూడా చర్చించారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సభా ఏర్పాటు కమిటీల్లో బాధ్యతలు అప్పగించే అంశాలపై కూడా చర్చించారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా, సమన్వయంతో కష్టపడి 16న జరిగే ప్రధాని మోదీ సభను దిగ్విజయం చేద్దామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. వేదిక, బస్సులు సమకూర్చడం వంటివాటిపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సభను విజయవంతం చేయాలన్నారు. రెవెశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఈ సభను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా దిశానిర్దేశం చేశారని, ప్రతి ఒక్కరు బాధ్యతగా దిగ్విజయం చేసేందుకు కృషి చేయాలన్నారు. మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సభా నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రోడ్ల కనెక్టివిటీ పెంచాలని రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ ఎస్‌ఈలను ఆదేశించారు. పీఎం కార్యక్రమాల స్పెషల్ ఆఫీసర్ వీర పాండియన్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహ కారంతో సభను విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, సీఎం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, టీడీపీ ఆదోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జిలు వైకుంఠం జ్యోతి, ఎన్.రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ, ఏపీ కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు 6వేల మందితో బందోబస్తు


● ఎస్పీ విక్రాంత్ పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన కోసం ఆరు వేల మందితో భద్రత, బందోబస్తును సిద్ధం చేస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో లైజనింగ్ అధికారులు, సెక్టార్ ఆఫీసర్లతో ఆయన సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటన నిమిత్తం వీవీఐపీలు, డీజీపీ, ఐజీ, డీఐజీ స్థాయి వంటి ఐపీఎస్ అధికారులు జిల్లాకు వస్తుంటారని, లైజనింగ్ ఆఫీసర్లు, సెక్టార్ ఇన్‌చార్జి, లైజనింగ్ అధికారులు విధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిర్‌పోర్టు, రోడ్డు డైవర్షన్స్, చెక్ పాయింట్లు, ట్రాఫిక్ నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. దాదాపు 6వేల మంది భద్రతా సిబ్బంది జిల్లాకు వస్తారని, ఈ నెల 13న ఫోర్స్ రిపోర్టు, 14న ట్రయల్ రన్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు హుశేన్ పీరా, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

డెమోగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాష్ రాజ్



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా మాస్ మీడియా అధికారి (డెమో)గా ఎన్.ప్రకాష్‌రాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.ప్రకాష్‌రాజ్ కర్నూలు జిల్లా మాస్ మీడియా అధికారిగా పదోన్నతి పొందారు. దీంతో సోమవారం ఆయన కర్నూలు జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డెమోగా విధుల్లో చేరారు. ఈ మేరకు కొత్త డెమోకు డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ హెచ్ఈవో పద్మావతి, ఎంపీహెచ్‌ఏ స్టేట్ అసోసియేషన్ చైర్మన్ సి.చిన్నరాముడు, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర అభినందనలు తెలిపారు.

పసిడి పరుగులు

- ● 10గ్రా బంగారం ధర రూ.1,22,000 చేరిన వైనం
- ● సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుతున్న ధరలు
- ● వ్యాపారాలు తగ్గుముఖం



కొలిమిగుండ్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా మార్కెట్లో పసిడి ధర పరుగులు పెడుతోంది. సోమవారం ఒక్కరోజే 10గ్రా బంగారం ధరపై రూ.1,800 పెరిగింది. సరిగ్గా ఏడాది క్రితం 10గ్రా బంగారం ధర రూ.70వేలు ఉండగా, ప్రస్తుతం రెండింతల ధరకు చేరువవుతోంది. 24క్యారెట్ల బంగారం ధర మార్కెట్లో రూ.1,22,000కు చేరింది. బంగారం ధరలు చూసి సామాన్య, మధ్య తరగతి ప్రజల కళ్లు బైర్లు కమ్మే పరిస్థితులు నెలకొంది. ప్రస్తుత ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనే పరిస్థితులు లేవని ఆవేదన చెందుతున్నారు. గత మంగళవారం ఏకంగా రూ.2900 పెరిగి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించినట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. నిలకడలేని ధరల కారణంగా బంగారం వ్యాపారాలు సైతం పూర్తిగా తగ్గుముఖం పట్టాయని వ్యాపార వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.

శ్రీశైలానికి చేరుకున్న ఛత్రపతి పల్లకీ యాత్ర



పల్లకీ యాత్రలో పాల్గొన్న ముధోజి రాజే భోస్లే

శ్రీశైలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ పల్లకీ యాత్ర విజయవాడ నుంచి శ్రీశైలం వరకు 300 కిలోమీటర్లు సాగి సోమవారం శ్రీశైలంలోని ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రానికి చేరుకుంది. ఈ కేంద్రంలో దక్షిణ దిగ్విజయ్ దివస్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహారాజ రాజశ్రీ ముధోజి రాజే భోస్లే, ఛత్రపతి శివాజీ మహారాజ్ 13వ వారసులు పాల్గొన్నారు. 1677 అక్టోబరు 6వ తేదీన ఛత్రపతి శివాజీ తన అనుచరులు, సైన్యంతో కలసి ఈ తెలుగు నేల మీద అడుగుపెట్టి 348 సంవత్సరాలు పూర్తవుతుందని వారు తెలిపారు. ప్రతిఏడాది ఈ పల్లకి యాత్రను నిర్వహిస్తూ వారి ఆశయాలను, ఆలోచనలను కొనసాగించేలా చూస్తామన్నారు. ఈ యాత్రకు సహకరించిన సభ్యులకు, ఆయా గ్రామాల ప్రజలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

• నలుగురికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబంలోని నలుగురికి తీవ్ర గాయాల య్యాయి. బంధువులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఎస్.బోయినపల్లి ఎస్సీ కాలనీలో బండ నాగరాజు, బండ సువర్ణ దంపతులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి బండ అనిల్, బండ చరణ్ సంతానం. సువర్ణ ప్రస్తుతం గర్భిణి. రోజూ మాదిరిగానే ఆదివారం కుటుంబసభ్యులందరూ నిద్రకు ఉపక్రమించారు. అర్ధ రాత్రి సమయం లో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఇంటి లోపల అంతటా మంటలు వ్యాపించాయి. ఈప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో పాటు ఇంటి గోడలు బీటలు వారాయి. చుట్టూపక్కల వారు గమనించి బంధువులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు స్థానికుల సహాయంతో హుటాహుటిన ఆటోలో వెల్దుర్తి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. క్షతగాత్రులకు వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు.

ఎస్సీ బాబు జిల్లా బహిష్కరణ

• ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

సంజామల/ కోవెలకుంట్ల అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆల్వకొండ ఎస్సీ బాబును జిల్లా బహిష్కరణకు కలెక్టర్ ఆదేశించినట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ తెలిపారు. సోమవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా సంజామల మండలం ఆల్వకొండకి చెందిన ఎస్సీ బాబు గ్రామంలో, మండలంలో నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించాడు. నిందితుడి వివరాలను కలెక్టర్ రాజకుమారికి సమర్పించగా జిల్లా నుంచి బహిష్కరించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు నెలల వరకు జిల్లాలో అడుగు పెట్టరాదని, ఎక్కడైనా కనిపించినా, ఉత్తర్వులను ధిక్కరించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఎస్సార్బీసీ కాల్వలో పడి వ్యక్తి మృతి

బనగానపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన నరేశ్ (20) అనే వ్యక్తి చెర్వుపల్లె నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళుతూ అదుపు తప్పి ఎస్సార్బీసీ కాల్వలో పడి మృతిచెందినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. నరేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి నరేశ్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

యువకుడు ఆత్మహత్య



ధనుంజయ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గువ్వలదొడ్డిలో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈడిగ భీమన్న కుమారుడు ఈడిగ ధనుంజయ (30)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలుగలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది పొలంలో పురుగులు మందు తాగాడన్నారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



వీరారెడ్డి

నంద్యాల టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన వీరారెడ్డి అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడు. దీంతో తన కుమారుడు వెంకటసుబ్బారెడ్డి సోమవారం తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఈశ్వరయ్య వివరాల ప్రకారం.. ఈనెల 2న వీరారెడ్డి గుడికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లు, పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇటుకతో కొట్టి.. మిద్దెపై నుంచి పడేసి..

• భార్యను దారుణంగా హతమార్చిన భర్త
• ఆర్. క్రిష్ణాపురంలో ఘటన, పరారైన నిందితుడు
• గాలింపు చేపట్టిన పోలీసులు



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ ప్రమోద్, సీఐ మురళీధర్‌రెడ్డి

ఆళ్లగడ్డ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఓ భర్త నిద్రిస్తున్న తన భార్యను ఇటుకతో తలపై కొట్టి.. మిద్దెపై నుంచి పడేసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన మండలంలోని ఆర్.క్రిష్ణాపురం గ్రామంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. చింతకుంట గ్రామానికి చెందిన శేషగిరికి ఆర్.క్రిష్ణాపురం గ్రామానికి చెందిన ఓబులమ్మ(40)కు ఇచ్చి 19 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శేషగిరికి గ్రామంలో 1.5 ఎరాల భూమి ఉండగా దానిని అమ్మడంతో రూ.40లక్షలొచ్చాయి. ఈనేపథ్యంలో వ్యసనాలకు బానిసై డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేయసాగాడు. నిత్యం తాగి వచ్చి భార్య ఓబులమ్మతో గొడవ పడేవాడు. దీంతో కొన్ని రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్యపై అనుమానంతో అతడు రగిలిపోయాడు. ఆదివారం అర్ధరాత్రి ఇంటిపైన భార్య నిద్రిస్తుండగా వచ్చి సిమెంట్ ఇటుకలతో తలపై కొట్టి మిద్దెపై నుంచి కిందపడేసి దారుణంగా హత్యచేసి పరారయ్యాడు. విషయం తెలిసిన వెంటనే ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు అధికారులు ఘటనాస్థలికి చేరుకున్నారు. హత్య జరిగిన వివరాలు తెలుసుకొని నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని నంద్యాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మామపై అల్లుడు కత్తితో దాడి

గోస్పాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీబగుంట్ల గ్రామంలో మద్యం మత్తులో మామపై అల్లుడు ఆదివారం రాత్రి కత్తితో దాడి చేశాడు. సోమవారం బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సుధాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ చిన్న నరసింహుడు తన కూతురును అదే గ్రామానికి చెందిన మురళికి ఇచ్చి ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశాడు. అయితే, అల్లుడు మద్యానికి బానిసై తరచూ కూతురును ఇబ్బందులకు గురి చేసేవాడు. ఆదివారం రాత్రి కూడా మురళి తాగి వచ్చాడు. దాంతో ప్రవర్తన మార్చుకోవాలని చిన్న నరసింహుడు అల్లుడికి చెప్పడంతో కోపోద్రిక్తుడైన మురళి కత్తితో మామపై దాడిచేశాడు. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. సోమవారం చిన్న నరసింహుడు భార్య సుబ్బలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులపై తేనేటీగల దాడి

గడివేముల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులపై సోమవారం తేనేటీగలు దాడి చేశాయి. మధ్యాహ్నం విద్యార్థులు తరగతి గదికి వెళ్తుండగా తేనేటీగలు గుంపుగా లేచి దాడి చేశాయి. ఎనిమిది మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడిని గడివేముల పీహెచ్‌సీకి తరలించారు. హెచ్ఎం శైలజ అప్రమత్తమై విద్యార్థులను హాస్టల్ గదుల్లో ఉంచారు.

ప్రతి పల్లెలోనూ బీజేపీ జెండా ఎగరాలి

• రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



సమావేశంలో ఖడ్గం ఎత్తి అభివాదం చేస్తున్న నాయకులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి పల్లెలో, ప్రతి ఇంటిలో బీజేపీ జెండా ఎగరాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఓ కల్యాణమండపంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నగరంలోని రాజ్‌విహార్ కూడలి నుంచి పెద్దపార్కు, పాత కంట్రోల్ రూం మీదుగా సభాస్థలికి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుందన్నారు. పార్టీలోని అన్ని అనుబంధ విభాగాల్లో యువతకు పెద్ద పీట వేస్తామన్నారు. రాయలసీమలో ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమలకు ఏర్పాటుకు బీజేపీ ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. సీమ ప్రాంతంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం ఎంతో వెనకబడిందని, దీని కోసం గతంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశామన్నారు. రాయలసీమ హక్కుల ఐక్య వేదిక ఏర్పాటు చేసి చాలా వరకు సాధించామన్నారు.

రాయలసీమ డిక్లరేషన్‌ను మరోసారి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై అంచనాలతో నివేదించిన ప్రభుత్వాలు మారటంతో కార్యరూపం దాల్చలేదని, దానిని మరోసారి ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ఎవరినైన అందలం ఎక్కించేది కేవలం ఒక్క బీజేపీ పార్టీలోనే అన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఇతర పార్టీల్లోలాగా వారసత్వాలను నమ్ముకున్న పార్టీ కాదని, బీజేపీ జవసత్వాలతో పనిచేసే పార్టీ అన్నారు.

పార్టీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కల్గిన కమ్యూనిస్టు పార్టీలు నామరూపాల్లేకుండా పోతే, జాతీయ వాదం కల్గిన బీజేపీ దేశాన్ని పాలిస్తోందన్నారు. శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలు కలిగి అంకితభావంతో బాధ్యతలు నిర్వర్తించే వారికి పార్టీలో ఎదుగుదల ఉంటుందన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ బీజేపీ అభిమానులు కార్యకర్తలుగా మారి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.



పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మంత్రాలయానికి చెందిన ఆయన గతంలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను నేతలు, కార్యకర్తలు శాలువ కప్పి, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, గీతామాధురి, వినూష రెడ్డి, అంకాల్‌రెడ్డి, కుర్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలు అందించండి

• డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్



క్యాన్సర్ హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రోగులకు నాణ్యమైన సేవలు అందించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ తెలిపారు. సోమవారం కర్నూలు సర్వజన వైద్యశాలను డీఎంఈ సందర్శించారు. అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, పరిశుభ్రత, రోగుల పట్ల సేవభావం కలిగి ఉండాలని డీఎంఈ ఆదేశించారు. అనంతరం స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్, నర్సింగ్ స్కూల్‌ను పరిశీలించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై డీఎంఈ ఆరా తీశారు. వైద్యసిబ్బందితో మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో రాజీ ఉండకూడదన్నారు. చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులతో మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను విస్తృతంగా ఉపయోగించి సేవల నాణ్యతను పెంచాలని సూచించారు.

నర్సింగ్ కాలేజీలో సమీక్ష

కాలేజ్ ఆఫ్ నర్సింగ్ హాస్టల్ వసతులను డీఎంఈ పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్ సమీపంలో ఉన్న నర్సింగ్ స్కూల్ భవనాన్ని డీఎంఈ పరిశీలించారు. కొత్త భవనానికి సం బంధించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించి దీనిపై ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లతో చర్చించారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్స్ వైద్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పెరగనున్న కొనుగోలు శక్తి



వాహనాలను పరిశీలిస్తున్న జేసీ, జాయింట్ కమిషనర్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తగ్గించిన జీఎస్టీతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని జాయింట్ కమిషనర్ జె.నీరజ అన్నారు. సోమవారం ఎస్ఏపీ క్యాంపులో జీఎస్టీ ఎక్స్‌పోను జాయింట్ కలెక్టర్ డా.నవ్య ప్రారంభించారు. స్టాళ్లను జేసీ, అధికారులు పరిశీలించారు. నిత్యావసర వస్తువులు, స్టేషనరీ, మెడిసిన్లుతో పాటు టూ వీలర్, కార్లు, ట్రాక్టర్ల తగ్గిన ధరలపై అవగహన వచ్చేలా బోర్డులు ఏర్పాటు చేశారు. డీఎస్‌వో రాజా రఘువీర్, డీసీ మురళి మనోహర్, ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్ బాషా, వ్యాపార సంస్థల అధినేతలు పాల్గొన్నారు.

మట్టిమిద్దె కూలి చిన్నారి మృతి

• త్రుటిలో తప్పించుకున్న కుటుంబ సభ్యులు
• మాధవరం గ్రామంలో ఘటన





కూలిన మట్టిమిద్దె.. చిన్నారి లలిత (ఫైల్ ఫొటో)

మంత్రాలయం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు ఓ మట్టిమిద్దె కూలి ఓ చిన్నారి అనంత లోకాలకు చేరింది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి మాధవరం గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నాగలదిన్నె భీమరాయుడు, నాగమ్మ దంపతుల ఇల్లు మట్టిమిద్దె. భీమ రాయుడు భార్య నాగమ్మ, కొడుకు మల్లికార్జున, కూతురు శ్రావణి, మనుమళ్లు, మనుమరాలు లలిత(5) ఇంటిలో నిద్రించారు. ఇరవై రోజులుగా కురిసిన భారీ వర్షాల కు మట్టిమిద్దె పూర్తిగా దెబ్బతిని వారు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్ప కూలింది. అందులో భీమరాయుడు, నాగమ్మ, మల్లికార్జున, శ్రావణి త్రుటిలో తప్పించు కున్నారు. చిన్నారి లలిత మట్టిలో కూరుకుపోయింది. కుటుంబీకులు మట్టిని తొలగించి చిన్నారిని కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆమె మృతిచెందింది. చిన్నారి తల్లిదండ్రులు రామాంజిని, మహేశ్వరి దంపతులు గోనెగండ్ల మండలం గంజిహళ్లిలో నివాసం ఉంటున్నారు. కాగా పాపను చదువు కోసం అమ్మమ్మ వద్ద ఉంచారు. లలిత మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో రూ.25వేలు విలువ చేసే గొర్రెలు మృతి చెందగా.. మరో రెండు గొర్రెలు ప్రాణాలతో బయటపడ్డాయి. చిన్నారి మృతదేహాన్ని సొంత గ్రామం గంజిహళ్లికి తీసుకెళ్లి అంత్య క్రియలు చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

మట్టిమిద్దె కూలి చిన్నారి లలిత మృతి చెందడం బాధాకరం. విచారణ జరిపాం. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం. ● రమాదేవి, తహసీల్దార్

బాణసంచా స్వాధీనం

కోడుమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఇళ్ల మధ్యలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను సోమవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి.వై స్వామి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిల్వలపై దాడులు చేసి సరుకును స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడిన బాణసంచాను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని వివరించారు.

అనారోగ్యంతో సీఐ మృతి



కర్నూలు క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో సీఐ జాన్సన్ బాబు రావు సోమవారం రాత్రి 8.35 మృతి చెందారు. వివరాల మేరకు.. కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి అధికంగా విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు అమీలియో ఆసుపత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. 2002 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఈయన సొంతూరు జిల్లా కడప. కర్నూలులో వన్‌టౌన్, డీసీఆర్‌బీ, కోర్టు మానిటరింగ్ తదితర పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో పోస్టింగ్ రాగా, డీఐజీ కార్యాలయంలో అటాచ్‌మెంటులో ఉంటున్నారు. పలువురు పోలీసు అధికారులు సంతాపం తెలిపారు. ఈయనకు భార్య ఉంది, సంతానం లేరు.

కుందూలో శవం లభ్యం

నంద్యాల టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కుందూ నదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపారు. సోమవారం కుందూ నది భీమవరం వద్ద 30నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న పురుషుడి శవం కొట్టుకు వచ్చినట్లు స్థానికులు గుర్తించారు. మెడలో సాయి బాబా డాలర్, గద ఉన్నట్లు ఉంది. అలాగే కుడి చేతిపై అమ్మ అనే పచ్చబొట్టు ఉంది. ఎవరైనా ఆనవాళ్లు గుర్తించగలుగుతే తాలుకా పోలీసులను సంప్రదించాలని కోరారు.

వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

• జీజీహెచ్‌లో బంధువుల ఆందోళన
• నష్టపరిహారం ఇస్తామని రాసిచ్చిన సూపరింటెండెంట్



ధర్నా చేస్తున్న బాధితులు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నంద్యాలలోని జీజీహెచ్‌లో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండలం చెన్నంపల్లె గ్రామానికి వెంకటరమణ(40) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. నాపరాతి గనిలో పనిచేస్తుండగా బండరాయి కాలిపై పడింది. అక్కడ వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. గత నెల 29వ తేదీన నంద్యాల జీజీహెచ్‌లో చేరారు. అప్పట్నుంచి వైద్యులు అతడికి యాంటీ బయాటిక్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. కొంతమేరకు గాయం తగింది. ఎముక విరగడంతో ఆపరేషన్ నిమిత్తం సోమవారం యథావిధిగా యాంటీ బయాటిక్ ఇంజక్షన్ ఇచ్చారు. కొద్ది నిమిషాల వ్యవధిలోనే అతడు మృత్యువాత పడ్డాడు. చికిత్స కోసం వస్తే ప్రాణాలు తీస్తారా అంటూ బంధువులు మృతదేహాన్ని మార్చురీకి పంపకుండా ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే వెంకటరమణ చనిపోయాడంటూ ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాజకుమారి, డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, తహసీల్దార్ శ్రీనివాసులును జీజీహెచ్‌కు పంపి విచారణ చేయించారు. మృతుడి బంధువులు తమకు నష్టపరిహారం చెల్లించాలని పట్టుబట్టడంతో చివరకు కలెక్టర్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందించడానికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి బాధితులకు ఆర్థిక సాయం కోసం లిఖిత పూర్వకంగా రాసిచ్చారు.

కార్డియాక్ అరెస్ట్‌తో మృతి..

వెంకటరమణ మృతిచెందిన ఘటనలో వైద్యుల నిర్లక్ష్యంలేదు. ఇంజక్షన్ వికటించలేదు. సర్జరీ కోసం ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లేముందు యాంటీ బయాటిక్ ఇంజక్షన్ ఇచ్చారు. మృతుడు కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెంది ఉండొచ్చు.
●డాక్టర్ మల్లేశ్వరి, సూపరింటెండెంట్, జీజీహెచ్, నంద్యాల

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



ఇన్‌చార్జి ఏడీఏ హేమలతకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురిసిన అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఇన్‌చార్జి ఏడీఏ హేమలతకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన మూడు నెలల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పొలాల్లో నీరు నిలిచి పంటలన్నీ దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ఎకరాకు రూ.40వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రబీ సీజన్‌కు సంబంధించి ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు మాబాషా, వీరన్న, మహెబూబ్ తదితరులున్నారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం

ఆత్మకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు పేదలకు వరమని టీడీపీ మండల, పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, రవీంద్రబాబు అన్నారు. సోమవారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ పేరిట పట్టణంలోని అర్బన్‌కాలనీలో అవగాహన ర్యాలీ ని ర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభు త్వం నిర్దేశించిన జీఎస్టీ మార్పులతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరగనుందన్నారు. ధరల నియంత్రణతో ప్రజలకు ఆర్థిక భా రం తగ్గనుందని వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ షాబుద్దీన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా పాల్గొన్నారు.

మహానంది: జీఎస్టీ తగ్గింపుతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ యశస్వీని అన్నారు. సోమవారం మండలంలోని మసీదుపురం గ్రామంలో కూటమీ నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కంచెర్ల శివ, మండల క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జి. మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

నంద్యాల రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు సూపరింటెండెంట్ గురుస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పీహెచ్‌సీలకు వెళ్లే టీఏ, డీఏలు ఇవ్వాలని అన్నారు. గిరిజన గూడెంలలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి షమీం, శివమ్మ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్యాన్సర్ నివారణ టీకాలు

జూపాడుబంగ్లా, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగోపుల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు బచ్చు జానకీరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలు ఒమెగా హాస్పటల్ క్యాన్సర్ నివారణ వైద్యులు రవీంద్రబాబు, సాయివాణి క్యాన్సర్ నివారణ టీకాలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బచ్చు జానకీరాం ఫౌండేషన్ ద్వారా రూ. 3200 ఖర్చయ్యే రెండు దఫాలుగా 180 మంది విద్యార్థులకు టీకాను ఉచితంగా వేశామన్నారు. కార్యక్రమంలో తర్తూరు దేవస్థానం చైర్మన్, గ్రామ మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, గ్రామపెద్దలు నాగార్జునరెడ్డి, హెచ్‌ఎం కృష్ణకుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పద్మజ, విజయలక్ష్మీ, జయలక్ష్మీ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

మహానంది,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అడవుల్లోని వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి అన్నారు. సోమవారం మహానంది సమీపంలోని రామకృష్ణ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు అడవితో పాటు వన్యప్రాణులను ఏవిధంగా రక్షించుకోవాలనే అంశాలపై డీఆర్వో అవగాహన కల్పించారు. అడవులను సంరక్షించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునన్నారు. అలాగే గాజులపల్లిలో చలమ సెక్షన్ ఆఫీసర్ విజయవర్ధన్, బీట్ ఆఫీసర్ మద్దిలేటి స్వామి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో న్యాయాధికారి పూజలు

పాణ్యం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు దేవస్థానంలో సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా సీనియర్ సివిల్ న్యాయాధికారి శేషాద్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయాధికారికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేయించారు. న్యాయాధికారిని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, అర్చకులు సురేష్‌శర్మ, పాల్గొన్నారు.

రూ.7.74 కోట్లతో చెరువుల మరమ్మతులు

- మైనర్ ఇరిగేషన్ ఏఈ శివకుమార్

కొత్తపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుల మరమ్మతులకు రూ.7.74 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు మండల మైనర్ ఇరిగేషన్ ఏఈ శివకుమార్ తెలిపారు. సోమవారం ఏఈ శివకుమార్ మాట్లాడారు. ఆర్‌ఆర్‌ఆర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం వాటా 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 40 శాతం నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే ఆయా గ్రామాల చెరువుల్లో ముళ్ల కంపల తొలగింపు, కట్ట బలోపేతం, తూములు, కాలువలు, అలుగు మరమ్మతులు చేపట్టినట్లు ఏఈ వెల్లడించారు.

వడ్డే ఓబన్న పోరాటం మరువలేనిది

గడివేముల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారిపై వడ్డె ఓబన్న చేసిన పోరాటాన్ని మరువలేనిదని వడ్డెఓబన్న సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బీవీఎన్ రాజు అన్నారు. వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా సోమవారం తిరుపాడు గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రమణ, జంబులు, కేతన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరాపురంలో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

కొత్తపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో పూజల విషయంలో ఇద్దరి వ్యక్తుల మధ్య సోమవారం ఘర్షణ చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బోరెడ్డి రమణారెడ్డికి కమ్మరి శ్రీనివాసాచారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శ్రీనివాసాచారి దాడి చేయడంతో రమణారెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గ్రామస్థులంతా కలిసి శ్రీనివాసాచారిపై దాడి చేశారు. రమణారెడ్డిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా.. ఘర్షణ పడిన విషయం తెలిసింది గానీ, ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

వసతి గృహాలను వదిలేశారు..!

- రోడ్డు, ప్రహరీ లేక ఇబ్బందులు
- చిన్నపాటి వర్షానికి మైదానం బురదమయం
- రైల్వేట్రాక్‌పై నుంచి రాకపోకలు
- వసతులు కల్పించాలని విద్యార్థుల వేడుకోలు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద విద్యార్థులు.. ఉన్నత చదువులు చదివేందుకు పట్టణాలకు వచ్చారు. అద్దెలు కట్టలేక ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వసతిగృహాల్లో ఉంటున్నారు. వీరంతా ఇంటర్, డిగ్రీ, పీజీ చదివేవారే. అయితే ఈ వసతిగృహాల్లో వసతులు కరవై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు హాస్టళ్లకు కాంపౌండ్ వాల్స్ లేకపోవడం, సరైన రహదారులు లేక విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.



రైల్వే ట్రాక్‌పై ప్రమాదకరంగా వెళ్తున్న విద్యార్థి (ఫైల్)

నంద్యాల జిల్లాలో 38 ఎస్సీ, 33 బీసీ, 13 ఎస్టీ వసతి గృహాలున్నాయి. వీటిలో దాదాపు తొమ్మిది వేల మంది విద్యార్థులుంటున్నారు. నంద్యాల పట్టణంలో 5 ఎస్సీ, 4 బీసీ, 2 ఎస్టీ హాస్టళ్లున్నాయి. వీటిలో దాదాపు 1500 మంది విద్యార్థులున్నారు.పట్టణంలోని బొమ్మలసత్రంలోని ఎస్సీ వెల్ఫేర్ వసతి గృహాలు 1, 2, ఎస్టీ వెల్ఫేర్ కళాశాల వసతిగృహాలకు కాంపౌండ్ వాల్ లేదు. దాంతో కొందరు విద్యార్థులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వసతి గృహాలకు వెళ్లే మట్టి రోడ్డులో కంపచెట్లు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. చిన్నపాటి వర్షం కురిసినా బురదమయమౌతుంది. దీంతో విద్యార్థులు వసతి గృహాల వెనుకవైపునున్న మురుగు కాల్వను దాటి రైల్వే ట్రాక్‌పై ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నది. ఇది వరకు ఆ రైల్వే ట్రాక్‌పై ఓ విద్యార్థి మృతిచెందిన విషయం తెలిసిందే. అలాగే రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ విషపురుగులు వసతిగృహాల్లోకి వస్తున్నాయని విద్యార్థులు భయాందోళనలు చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి రక్షణగోడలు నిర్మించాలని, రోడ్డు వేయించాలని కోరుతున్నారు.



పట్టణంలో ఎస్సీ వసతిగృహం



చిన్నపాటి వర్షానికే బురదమయమైన ఎస్టీ హాస్టల్ మైదానం

జూపాడుబంగ్లాలో భారీ వర్షం

- ఉప్పొంగిన వాగులు, వంకలు
- నీట మునిగిన పొలాలు

జూపాడుబంగ్లా, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. దీంతో పారుమంచాల కాకిలేరు, ఇసుకవాగులు ఉప్పొంగి ప్రవహించాయి. ఈ వర్షంతో మొక్కజొన్నరైతులు, పత్తిరైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. 80బన్నూరు వద్ద వాగు ఉధృతికి వరిపైరు నీట మునిగింది. పారుమంచాల ఇసుకవాగు ఉప్పొంగి ప్రవహించడంతో ప్రధానరహదారిపై ఆర్టీసీ బస్సు , వాహనాలు దాటడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వంతెన ఎప్పుడో పూర్తి చేస్తారో సమస్య తీరుతుందోనని గ్రామస్థులు అధికారులు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జూపాడుబంగ్లాలోని ఉద్యానవనపార్కు, తహసీల్దార్ కార్యాలయ ఆవరణంతా వర్షపునీటితో నిలిచిపోయింది. మొత్తం 43.2 మీ.మీ., వర్షపాతం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



80బన్నూరు వద్ద వర్షపు నీటిలో మునిగిన వరిపైరు

ప్రధాని పర్యటనకు పనులు వేగవంతం



శ్రీశైలంలో జరుగుతున్న రోడ్డు పనులు

శ్రీశైలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలానికి రానున్నారు. దాంతో పలు పనులు వేగవంతమయ్యాయి. క్షేత్రంలో బీటీ రోడ్లు, టోల్‌గేట్ డౌన్, నందిమండపం, భ్రమరాంబ అతిథి గృహం, గంగాధర మండపం, దేవస్థానం ఆస్పత్రి నుంచి పరిపాలన భవనం వరకు మూడు ప్రాంతాల్లో ఆయా పనులను ప్రారంభించినట్లు శ్రీశైలదేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా గతంలో టెండర్లు పిలిచిన పనులను అత్యవసర ప్రాతిపాదికన చేపట్టారు. ఆలయం ముందు భాగం నుంచి వెనుక భాగం వరకు రెడ్ కార్పెట్, బ్యారికేడింగ్ పనులు చేయనున్నట్లు తెలిపారు. ముఖద్వారం నుంచి టోల్‌గేట్ వరకు ఫోర్‌లైన్స్ రోడ్డు, హటకేశ్వరం వద్ద టోల్‌ప్లాజాకు, కాలిబాటన వచ్చే భక్తుల కోసం కైలాస ద్వారం వద్ద షెడ్ల నిర్మాణానికి అటవీశాఖ నుంచి స్థలాన్ని కోరేందుకు నివేదికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

పీ-4కు తొలి అడుగు



బానకచెర్లలో ఇంటి నిర్మాణానికి పూజ చేస్తున్న టీడీపీ నాయకుడు సింగపూరు నాగేశ్వరరావు

పాములపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు బంగారు కుటుంబాలలో భాగంగా పీ- 4 కార్యక్రమానికి మండలంలో వేంపెంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సింగపూరు నాగేశ్వరరావు తొలి అడుగు వేశారు. తనవంతు సాయంగా బానకచెర్ల గ్రామానికి చెందిన జంగాల సుంకూరు రామరావు వృద్ధ దంపతుల ఇంటి నిర్మాణానికి ఆయన భూమిపూజలు చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. సొంత డబ్బులతో ఇంటిని నిర్మించి ఇస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండ్లమూరి చంద్రశేఖర్, చిట్టి నాగార్జునరెడ్డి, లింగేశ్వరగౌడ్, వినయ్‌కుమార్, రాజేశ్, నారాయణగౌడ్, శివలింగం, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైల గిరిప్రదక్షిణ

శ్రీశైలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీగిరి ప్రదక్షిణ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సోమవారం పౌర్ణమి ఘడియలు రావడంతో స్వామి, అమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ మహాద్వారం నుంచి గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, బయలువీరభద్రస్వామి, అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారి, తదితర ప్రాంతాల నుంచి సాగింది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీస్వామివార్ల దర్శనం కల్పించారు.

పంచమఠాలలో పూజలు

శ్రీశైలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం పంచమఠాలలో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం విశేష పూజలు, అభిషేకం, పుష్పార్చనలు చేశారు. ముందుగా ఘంటామఠంలో. ఆ తరువాత భీమశంఖ రమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో పూజలు చేశారు.


కుంకుమార్చనలో 19 మంది భక్తులు

శ్రీశైలం, అక్టోబరు 6, (ఆంధ్రజ్యోతి): శ్రీగిరి క్షేత్రంలో నిర్వహించిన పరోక్షసేవ లక్ష కుంకుమార్చనలో 19 మంది భక్తులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పూజలు నిర్వహించారు.

కబ్జా స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

పాణ్యం, అక్టోబరు 6 : (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని మాలమహానాడు డివిజన్ నాయకుడు దేవదత్తు కోరారు. సోమవారం డీటీ శివశంకరరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

నంద్యాలలో సినీ నటుడు సుమన్



నూతన వధూవరులతో సినీ నటుడు సుమన్

నంద్యాల కల్చరల్/పాణ్యం అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుమన్ నంద్యాలలో పాణ్యం మండల కేంద్రానికి చెందిన జంషీర్‌బాషా అల్లుడి పెళ్లికి సోమవారం హాజరయ్యారు. సుమన్ వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలకు రావడం ఆనందంగా ఉందన్నారు. పట్టణంలో తనకు చాలా మంది స్నేహితులు ఉన్నట్లు గుర్తు చేసుకున్నారు. పట్టణంలోని అభిమాని బాలకృష్ణ ఇంటికి వెళ్లారు. అలాగే పాణ్యంలో జనసేన కన్వీనర్ జగదీశ్ బాబు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సుమన్ అభిమానులు షరీఫ్, ఆనంద్, వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

9న జాబ్‌మేళా

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఈ నెల 9న నిరుద్యోగ యువతీ, యువకుల కోసం బాబ్‌మేళా నిర్వహించనున్నట్లు రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. 2022నుంచి 2025సంవత్సరంలో ఏదైనా డిగ్రీ పాసైన విద్యార్థులు అర్హులన్నారు. హైదరాబాద్ కంపెనీ కన్సార్‌ప్యాక్ సర్వీస్ ఎల్‌ఎల్‌సీవారు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, బయోడేటా, ఆధార్‌కార్డ్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు తీసుకురావాలని కళాశాల ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి డా.యువీఎస్ కుమార్, కేఎస్‌కుమార్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలివ్వాలి

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్, మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్, ఉపాధ్యక్షులు గౌస్, ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ నాయకులతో కలిసి పారిశుధ్య కార్మికుల ధర్నా నిర్వహించారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు ఫాతిమ, మహేష్, రాజమ్మ, వెంకటేశ్వరమ్మ, రమణమ్మ, సులోచన, లీలావతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పలు దేవాలయాల సందర్శన



సముద్రాల ఆచార్య షికామణి మిత్ర బృందంతో స్థానికులు

నందికొట్కూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చిన్నజియర్ స్వామి శిష్యుడు సముద్రాల ఆచార్య షికామణి మిత్ర బృందం సోమవారం పట్టణంలో పలు దేవాలయాలను సందర్శించారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు భీమిశెట్టి జయరామకృష్ణ, సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామిజీ ఆలయంలో ప్రవచానలు బోధించారు. అలాగే నగరేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి దేవాలయాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆర్వేటి సుబ్రహ్మణ్యం, వీరబొమ్మ శ్రీనివాసులు, సర్విశెట్టి పార్థసారథి, బలుసా నాగరాజు, బద్రిశెట్టి సురేష్ కుమార్, మలే రాజేశ్, ఆర్వేటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులు వచ్చేశాయ్..!

(3వ పేజీ తరువాయి)

తాజాగా కూటమి ప్రభుత్వం జిల్లాకు కొత్తవి, పాతవి కలిపి మొత్తంగా 5,32,570 స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రింట్ చేసి మంజూరు చేసింది. ఈ లెక్కన జిల్లాకు కొత్తగా 7598 రేషన్‌కార్డులు వచ్చినట్లైంది. దీంతో ఆయా వర్గాల కష్టాలు తప్పినట్లైంది. ఈ ఏడాది జూన్ ఆఖరి వరకు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే సదరు రేషన్‌కార్డులు మంజూరయ్యాయని అధికార యంత్రాంగం పేర్కొంది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దరఖాస్తు చేసుకున్న వారికి రెండో విడతలో మంజూరవుతాయని తెలిసింది.

పక్కాగా డిజిటల్ కార్డులు

కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన డిజిటల్ కార్డులు సమగ్ర అంశాలతో ఆన్‌లైన్‌లో ఉండేలా పక్కాగా రూపొందించారు. ప్రతికార్డులోనూ రేషన్‌కార్డుదారుని పేరుతో సహా కుటుంబ సభ్యులు సమగ్ర వివరాలు ఉండేలా ఏర్పాటుచేశారు. రేషన్‌కార్డు నెంబరు, దుకాణం నంబరు, కార్డుదారుడి ఫొటో, కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్, ఈకేవైసీ స్థితి, ఆయా రేషన్‌కార్డుల రేషన్ కేటాయింపు వివరాలు ఉండేలా రూపొందించారు. టోల్ ఫ్రీ నెంబర్ కూడా ముద్రించారు.

సులభంగా సరుకులు పొందొచ్చు

గతంలో మాదిరిగా కాకుండా స్మార్ట్‌కార్డులతో సులభంగా నిత్యావసర సరుకులు పొందొచ్చు. జిల్లాకు వచ్చిన ఈకార్డులను జిల్లా అధికార యంత్రాంగం ఆయా మండలాల తహసీల్దార్లకు అందజేశారు. ఇదే క్రమంలో తహసీల్దార్లు సైతం తమ పరిధిలోని సచివాలయ ఉద్యోగుల ద్వారా రేషన్‌కార్డు దారులకు కొత్త డిజిటల్ కార్డులను పంపిణీ చేసి యాక్టివేషన్ చేస్తున్నారు.

అర్హులందరికీ కార్డులొస్తాయి..



జిల్లాకు 5,32,570 స్మార్ట్ కార్డులొచ్చాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. రెవెన్యూ, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఆయా రేషన్‌కార్డుదారులకు అందించేలా చర్యలు తీసుకున్నాం. మొదటి విడతలో రాని వారికి రెండో విడతలో కా ర్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అర్హులందరికీ కార్డులను అందజేస్తాం.

- రాజకుమారి, కలెక్టర్, నంద్యాల

నేడు వాల్మీకి జయంతి

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహర్షి వాల్మీకి జయంతిని జయప్రదం చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి జగ్గయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాల్మీకి జయంతిని కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వాల్మీకి, ఇతర కులాల సంఘాలు, వాల్మీకులు హాజరుకావాలని కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

నందికొట్కూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రంథాలయానికి వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. సోమవారం సొసైటీ సభ్యులు యోగా, మెడిటేషన్, కాన్ఫిడెన్స్, అవేర్‌నెస్, రిలాక్సేషన్, స్మృతులు, తాళపత్ర గ్రంథాలు, సద్గురువుల చరిత్రలకు సంబంధించిన 150 రకాల పుస్తకాలను గ్రంథాలయాధికారి మురళీకి అందజేశారు. ఈ పుస్తకాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని సభ్యులు కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీశైలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యఅన్నదాన పథకానికి సోమవారం దాతలు విరాళాలు ఇచ్చారు. ఆలయ పర్యవేక్షకుడు కె. శివప్రసాద్‌కు గుంటూరుకు చెందిన వీర శేఖరరావు, కర్నూలుకు చెందిన ఎల్. రమేష్‌బాబు కుటుంబ సభ్యులు వేర్వేరుగా రూ. లక్ష విరాళం అందజేశారు. దాతలకు దేవస్థానం తరుపున రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు. అంతకుముందు వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

ఆత్మకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని బాపనంతాపురం గ్రామం వద్ద నంద్యాల - కల్వకుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకులు రాజశేఖర్, సుధాకర్, మాబాషా కోరారు. సోమవారం తహసీల్దారు రత్నరాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దాపురం గ్రామం మొదలుకొని కరివేన, చెలిమిల్ల, లింగాల వరకు పంటపొలాలకు బండ్ల రస్తా ఉండేదన్నారు. అయితే 167 జాతీయ రహదారి నిర్మాణంతో పంట పొలాలకు రస్తా సమస్య ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

'అవకాశమివ్వకపోవడం విచారకరం'

నంద్యాల రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డు పాలకమండలిలో వీరశైవ సమాజానికి అవకాశమివ్వకపోవడంపై వీరశైవ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు విచారం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వీరశైవులకు ప్రముఖ శివాలయాల్లో ప్రాధాన్యం, దేవస్థానాల పరిపాలనలో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. సమావేశంలో వీరశైవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

నందికొట్కూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి యువకుడు గురికావడంతో గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం నందికొట్కూరులో చోటు చేసుకుంది. పట్టణంలోని బైరెడ్డినగర్‌కు చెందిన ఈశ్వర్ అనే యువకుడు గొర్రెల మేత కోసం చెట్టు ఎక్కి ఆకులు కోస్తుండగా, కొమ్మలు విరిగి 11 కేవీ విద్యుత్ తీగలపై పడ్డాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై కిందపడి తీవ్ర గాయాలకు గురైయ్యాడు. 108 వాహంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

గోస్పాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌలభ్యం కోసం ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోందని తహసీల్దారు షేక్‌మొహిద్దీన్ అన్నారు. సోమవారం మండలంలోని గోస్పాడులో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ అమానుల్లా, వీరసింహారెడ్డి, భూమా ఉసేని, విశ్వనాథరెడ్డి, వీఆర్వో రవీంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచులకు శిక్షణ

గడివేముల/పాణ్యం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయంలో మంగళ , బుధవారాల్లో సర్పంచ్‌లకు, డిజిటల్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందని గడివేముల,పాణ్యం ఎంపీడీవోలు వాసుదేవగుప్త, ప్రవీణ్‌కుమార్ వేర్వేరు ప్రకటనలో సోమవారం తెలిపారు. సొంత వనరులను పెంపొందించుకునే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. సర్పంచులు శిక్షణకు వచ్చేటప్పుడు ఆధార్‌కార్డు లింక్ ఉన్న సెల్ వెంట తెచ్చుకోవాలని అన్నారు.

స్మార్ట్ కార్డులు వచ్చేశాయ్..!

(3వ పేజీ తరువాయి)

తాజాగా కూటమి ప్రభుత్వం జిల్లాకు కొత్తవి, పాతవి కలిపి మొత్తంగా 5,32,570 స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రింట్ చేసి మంజూరు చేసింది. ఈ లెక్కన జిల్లాకు కొత్తగా 7598 రేషన్‌కార్డులు వచ్చినట్లైంది. దీంతో ఆయా వర్గాల కష్టాలు తప్పినట్లైంది. ఈ ఏడాది జూన్ ఆఖరి వరకు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే సదరు రేషన్‌కార్డులు మంజూరయ్యాయని అధికార యంత్రాంగం పేర్కొంది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దరఖాస్తు చేసుకున్న వారికి రెండో విడతలో మంజూరవుతాయని తెలిసింది.

పక్కాగా డిజిటల్ కార్డులు

కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన డిజిటల్ కార్డులు సమగ్ర అంశాలతో ఆన్‌లైన్‌లో ఉండేలా పక్కాగా రూపొందించారు. ప్రతికార్డులోనూ రేషన్‌కార్డుదారుని పేరుతో సహా కుటుంబ సభ్యులు సమగ్ర వివరాలు ఉండేలా ఏర్పాటుచేశారు. రేషన్‌కార్డు నెంబరు, దుకాణం నంబరు, కార్డుదారుడి ఫొటో, కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్, ఈకేవైసీ స్థితి, ఆయా రేషన్‌కార్డుల రేషన్ కేటాయింపు వివరాలు ఉండేలా రూపొందించారు. టోల్ ఫ్రీ నెంబర్ కూడా ముద్రించారు.

సులభంగా సరుకులు పొందొచ్చు

గతంలో మాదిరిగా కాకుండా స్మార్ట్‌కార్డులతో సులభంగా నిత్యావసర సరుకులు పొందొచ్చు. జిల్లాకు వచ్చిన ఈకార్డులను జిల్లా అధికార యంత్రాంగం ఆయా మండలాల తహసీల్దార్లకు అందజేశారు. ఇదే క్రమంలో తహసీల్దార్లు సైతం తమ ప రిధిలోని సచివాలయ ఉద్యోగుల ద్వారా రేషన్‌కార్డు దారులకు కొత్త డిజిటల్ కార్డులను పంపిణీ చేసి యాక్టివేషన్ చేస్తున్నారు.

అర్హులందరికీ కార్డులొస్తాయి..



జిల్లాకు 5,32,570 స్మార్ట్ కార్డులొచ్చాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. రెవెన్యూ, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఆయా రేషన్‌కార్డుదారులకు అందించేలా చర్యలు తీసుకున్నాం. మొదటి విడతలో రాని వారికి రెండో విడతలో కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అర్హులందరికీ కార్డులను అందజేస్తాం.

● రాజకుమారి, కలెక్టర్, నంద్యాల

వైభవంగా పవిత్రోత్సవం

చాగలమర్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకా పరమేశ్వరి ఆల యంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా వేద పండితుడు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో పవిత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సమర్పించిన లడ్డును ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో తిరుపతికి చెందిన ఎం.లక్ష్మీనరసింహ రూ.30,550 పాట పాడి లడ్డు దక్కించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి వరప్రసాద్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, సుబ్రమణ్యం, ఆర్యవైశ్యులు నాగేంద్రకుమార్, జ్వాల, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల చట్టంపై అవగాహన

రుద్రవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తువ్వపల్లె గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో వన్యప్రాణుల చట్టంపై విద్యార్థులకు, ప్రజలకు సోమవారం రేంజర్ ముర్తుజావలి అవగాహన కల్పించారు. రేంజర్ మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే 1972 చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. వన్యప్రాణుల సంరక్షణపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, మక్తర్ బాషా, రామక్రిష్ణ, రాణెమ్మ, బీట్‌ఆఫీసర్లు సురేంద్రగౌడ్, జేమ్స్‌పాల్, నరసింహారెడ్డి, మదన గోపాల్ పాల్గొన్నారు.

నక్కలదిన్నెలో జూదరుల అరెస్టు

రుద్రవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కల దిన్నె గ్రామ సమీపంలో సోమవారం పేకాట ఆడుతుండగా ఎస్సై మహ్మద్‌రఫి తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో అదే గ్రామానికి చెందిన 9 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ.10,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ భూపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీవాసుల ఆందోళన

చాగలమర్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని న్యూబిల్డింగ్స్ వీధిలో వర్షపు నీరు, మురుగు నీరు కలిసి నీటి కుంటను తల పిస్తున్నాయని, వర్షంలోనే సోమవారం కాలనీ వాసులు ఆందోళన చేశారు. రహదారిలో నీరు పోయేందుకు మురికి కాలువలు లేక రోడ్డు దెబ్బతిని వర్షపు నీరు నిలుస్తోందని కాలనీవాసులు వాపోయారు. పాలకులు, అధికా రులు స్పందించి సీసీ రహదారి, మురికి కాలువలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

చాగలమర్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తుందని తహసీల్దార్ విజయ్ కుమార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో గ్రీవెన్ సెల్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఎంఈవో అనూరాధ, పీఆర్ ఏఈ కొండారెడ్డి, సూపర్‌వైజర్ సుశీల పాల్గొన్నారు.

పండు ఈగ నివారణకు సస్యరక్షణ



ముత్యాలపాడులో జామ రైతుతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖాధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పండు ఈగ నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆళ్లగడ్డ ఉద్యానశాఖ అధికారి దస్తగిరి సూచిం చారు. 'జామకు పండు ఈగ బెడద' అన్న శీర్షిక ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఆయన రైతు రవీంద్రారెడ్డి సాగు చేసిన జామ తోటను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. సాగు వివ రాలు, పెట్టుబడి గురించి తెలుసుకొని వైరస్ వల్ల దెబ్బతిన్న తోటను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

శిథిల భవనాల పరిశీలన

శిరివెళ్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శిరివెళ్లలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్తకు చేరిన భవనాలను ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, డిప్యూటీ డీఈవో డీటీ శంకర్ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. విద్యార్థులను సురక్షిత భవనంలో కూర్చోబెట్టాలని సూచించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నూతన భవనాల నిర్మాణాలు చేపడ తామని వారు అన్నారు. అనంతరం పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వారు తనిఖీ చేశారు.

ఆళ్లగడ్డలో భారీ వర్షం

● పొంగి ప్రవహిస్తున్న వక్కిలేరు ● రాకపోకలకు అంతరాయం

ఆళ్లగడ్డ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో సోమవారం తెల్లవారు జామున నుంచి ఉదయం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. మండలంలో సోమవారం 33.6 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని పడకండ్ల గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై నుంచి వర్షం నీరు ప్రవహిస్తుంది. అలాగే మండలంలోని ఓబులంపల్లె గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి పై నుంచి వక్కిలేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో యాదవాడ, ఆలమూరు తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆలమూరు గ్రామ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న అట్టడి వాగు



ఓబులంపల్లెలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వక్కిలేరు

పలు గ్రామాలలో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. అహోబిలంలోని రోడ్డు పక్కన రైతులు ఆరబెట్టుకొన్న మొక్కజొన్న పంట వర్షం నీటిలో కొట్టుకుపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఉప్పొంగిన అట్టడివాగు

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామ సమీపంలో ఉన్న అట్టడి వాగు సోమవారం పొంగి ప్రవహించింది. ఆల మూరు నుంచి చాగలమర్రి మిట్టపల్లె వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వాగులో గతంలో ఓ యువకుడు గల్లంతైన విషయం విదితమే. ఒక్కసారిగా అట్టడి వాగు పొంగి ప్రవహించడంతో ప్రజలు భయాందోళన చెందారు. స్థానికులు ట్రాక్టర్ల సాయంతో జనాలను వాగు దాటించారు.

శ్మశాన వాటికలు ఆక్రమణ

● అంత్యక్రియలకు తప్పని అవస్థలు
● పట్టించుకోని అధికారులు

ప్యాపిలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శ్మశాన వాటికలు ఆక్రమణకు గురికావడంతో ఆరడుగుల స్థలం దొరకడం ఇబ్బందిగా మారింది. దీంతో ఆయా గ్రామాల్లో అంతిమ కష్టాలు తీవ్రంగా మారాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రమైన ప్యాపిలిలోని రెండు శ్మశాన వాటికలు ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ఏనుగమర్రి గ్రామంలో ఏనుగ మర్రి గ్రామంలో దశాబ్దాల క్రితం శ్మశాన భూమి 44వ జాతీయ రహదారి విస్తరణలో ముంపునకు గురైంది. అయితే అధికారులు శ్మాశానానికి భూమిని చూపలేదు. దీంతో గత్యంతరం లేక హైవే బ్రిడ్జి కిందనే శవాలను పూడ్చి పెట్టాల్సిన దుస్థితి ఏర్ప డింది. అలాగే వెంగళాంపల్లి, ఊటకొండ, పోతుదొడ్డి, వెంకటాంపల్లి, ఎన్ రంగాపురం, ఎర్రగుంట్లపల్లి తదితర గ్రామాల్లో కూడా శ్మశానవాటికల సమస్య తీవ్రంగా ఉంది. స్థలం ఆక్రమణకు గురికావడంతో పాత గుంతనే తీసి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. అధికారుల స్పందించి శ్మాశానా లను సర్వే చేయించి ఆక్రమణకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకొని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏనుగమర్రి గ్రామంలో ఈ బ్రిడ్జి కిందనే శ్మశాన వాటిక

ఎగువ అహోబిలంలో ముగిసిన పవిత్రోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎగువ అహోబిలంలో ఈనెల 2వ తేదీనుంచి ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు సోమవారం మహా పూర్ణాహుతితో ముగిసాయి. ఎగువ అహోబిలం ఉత్సవమూర్తి జ్వాల నరసింహస్వామి , చెంచులక్ష్మి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టు పవిత్ర మాలలతో అలంకరించి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అహోబిలం మఠం 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి స్వీయ పర్యవేక్షణలో ఈ ఏడాది పవిత్రోత్సవాలు వైభవంగా ముగిసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేనుగోపాలన్ స్వామి తెలిపారు.

ఘనంగా ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రంలో సోమవారం ఉమామహేశ్వర స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ఈవో పాండురంగారెడ్డి, యాగంటి ఉపసర్పంచ్ మౌలీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, బండి కుమార స్వామిరెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డోన్ మున్సిపాలిటీకి మూడు అవార్డులు

డోన్ టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపడుతుంది. జిల్లాలోని డోన్ మున్సిపాలిటీకి మూడు అవార్డులు వరించాయి. సోమవారం నంద్యాల జిల్లాలోని కలెక్టర్ రాజకుమారి గనియా చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర అవార్డ్స్-2025లో రాష్ట్ర స్థాయిలో మన ఊరు- మన గుడి - మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ అవార్డు లభించిందని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లాలో వివిధ విభాగాల్లో మొత్తం 51 అవార్డులు సాధించిన నిర్వాహకులకు ప్రభుత్వం మంజూరు చేసిన మెమెంటోలు, సర్టిఫి కెట్లు కలెక్టర్ అందజేసి సత్కరించారు. డోన్ నియోజకవర్గంలోని స్వచ్ఛ ఆసుపత్రులు కింద డోన్ ఏరియా ఆసుపత్రి ఎంపికైంది. అలాగే స్వచ్ఛ పరిశ్రమలు అవార్డుకు ఉడుములపాడు అగ్రిసోల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఎంపికైంది. అలాగే స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్ల విభాగంలో ఉంగరానిగుండ్ల ఎంపికైంది. ఇందుకు గానూ డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసా ద్ గౌడు ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగి రామాం జనేయులు కూడా బెస్టు డ్రైవర్‌గా ఎంపికయ్యారు. అలాగే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటూ సేవలందిస్తున్న సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ ఉత్తమ అవార్డుకు ఎంపికై కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఉన్నారు.



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్

ఉమ్మాయిపల్లె ఎస్టీ స్కూల్‌కు స్వచ్ఛత అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎంఈవో అబ్దుల్‌కలాం, ఉపాధ్యాయుడు రామయ్య

కొలిమిగుండ్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మాయిపల్లె ఎస్టీ పాఠశాలకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. ఈ మేరకు జిల్లా అధికారుల నుంచి సోమవారం మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం, ఎస్టీ పాఠశాల హెచ్‌ఎం రామయ్య ఈ ఆవార్డును అందుకున్నారు. ప్రభుత్వం పచ్చదనం .. పరిశుభ్రత అంశాలపై అందిస్తున్న ఈ అవార్డు మండలానికి లభించడం ఆనందంగా ఉందని ఎంఈవో తెలిపారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

రుద్రవరం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వర్షాలతో నష్టపోయిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు ధోని ఆల్‌ఫ్రెడ్, వ్యవసాయ విస్తరణాధికారి తైమా తబుస్సుమ్‌కు వినతిపత్రం అందించారు. రామచంద్రుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. మధ్య దళారులు మొక్కజొన్న క్వింటా రూ.1700 నుంచి రూ.1900 వరకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారని విమ ర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు గుర్విరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శంకరయ్య, నరేశ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి

డోన్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతిని జయప్రదం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరై వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేస్తారనీ తెలిపారు.

వాల్మీకి జయంతికి తహసీల్దార్ అనుమతి నిరాకరణ

కొలిమిగుండ్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి వేడుకలను జరుపుకోవడానికి కొలిమిగుండ్ల తహసీల్దార్ శ్రీనివాసులు అనుమతి ఇవ్వలేదు. కొలిమిగుండ్లలోని కేజీబీవీ సమీంలోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి ఆధ్వర్యంలో గత నాలుగేళ్లుగా వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సోమవారం ప్రజా స్పందన కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు దేవాదుల పవన్‌గోపాల్, పెద్దయ్య, రామూర్తి తదితరులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి అనుమతి కోరారు. అయితే ఈ ఏడాది ఇక్కడ వాల్మీకి జయంతి నిర్వహించడానికి అనుమతి లేదని తహసీల్దార్ చెప్పడంపై వారు ఆయనతో వారు వాగ్వాదానికి దిగారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ బీసీసెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు అన్నారు. సోమవారం చాగలమర్రి గ్రామంలోని 9వ వార్డులో టీడీపీ నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. డి.వనిపెంటలో టీడీపీ కన్వీనర్ గోపాల్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. నాయకులు నరసింహుడు, టైలర్ బాషా, ఓబులేసు, రమేష్, బషీర్, వీఆర్వో ఇమామ్ బాషా పాల్గొన్నారు.

శిరివెళ్ల: ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప అన్నారు. శిరివెళ్లలోని పలు రేషన్ దుకాణాల పరిధిలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ బాలచంద్రుడు, 5వ వార్డు మెంబర్ తిరుమల రవి, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు బట్టా సత్యం చౌదరి అన్నారు. మండలం లోని నల్లమేకలపల్లిలో మహిళలకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు.

బేతంచెర్ల: రేషన్‌కార్డుదారులు స్మార్ట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రూబెన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మేకల నాగరాజు, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని కోట పేటలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.



చాగలమర్రిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మెరుగైన వైద్యం అందించండి: మంత్రి



మహిళను పరామర్శిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు

బనగానపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణానికి చెందిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వ్యక్తిగత డ్రైవర్ రమణ తల్లి నంద్యాల ఉదయానంద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బీసీ ఇందిరమ్మ దంపతులు పరామర్శించారు. శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఆమెకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి వైద్యులకు సూచించారు.

దేశభక్తిని పెంచేందుకు కృషి చేయాలి

బేతంచెర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశభక్తిని పెంచేందుకు ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు కృషి చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచారక్ సురేంద్రబాబు అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశా లలో శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. సురేంద్రబాబు మాట్లాడుతూ దేశంలో 90వేల మంది ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌లు ఉన్నారని, దేశభక్తి కోస కృషి చేస్తున్నారన్నారు. బుగ్గన రమణారెడ్డి, సురేంద్రబాబు, రఘురాం పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

సంజామల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కానాల టీడీపీ నాయకులు కేశవ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆట స్థలం మైదానాన్ని ఆయన సొంత నిధులతో చదును చేయించారు. ఇన్‌చార్జి హెచ్.ఎం సావిత్రమ్మ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో కేశవ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్న మౌలాలి, బోధనా సిబ్బంది, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

కొలిమిగుండ్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థిని టి.లక్ష్మీశాంతి ఒరిస్సాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి సోమవారం తెలిపారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి 600 మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానం సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

డోన్ వాసికి డాక్టరేట్

డోన్ రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన నల్లబోతుల సురేష్‌కు డాక్టరేట్ దక్కింది. అమెరికాలోని టెక్సాస్‌లో డే స్ప్రింగ్ జియోలాజికల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను సురేష్ పొందారు. విద్యారంగం, సామాజిక సేవా విభాగాల్లో సేవలందించే వారికి ఇచ్చే డాక్టరేట్ మల్యాల గ్రామ నివాసి సురేష్‌కు దక్కడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

శిరివెళ్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుళాయప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ పార్టీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి సోమవారం నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చి వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామంలోని పలువురు టీడీపీ నాయ కులు, కార్యకర్తలు కుళాయప్ప మృతదేహానికి నివాళి అర్పించారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి



సొసైటీ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ కార్యకర్తలు, డైరెక్టర్లు

కోవెలకుంట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని కోవెలకుంట్ల మండల టీడీపీ కన్వీనరు, సొసైటీ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి అన్నారు. సంజామల గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు డైరెక్టరు, టీడీపీ కార్యకర్తలు సోమవారం కోవెలకుంట్లకు చేరుకుని గువ్వల సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి సన్మానించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పని చేసే కార్యకర్తలను గుర్తింపు ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు గువ్వల సుందర్రెడ్డి, కుళాయిబాషా, హుసేనీ, డైరెక్టరు పాల్గొన్నారు.

డైరెక్టర్‌ని కలిసిన టీడీపీ నాయకులు

శిరివెళ్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని శిరివెళ్ల, గుండంపాడు గ్రామాల టీడీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోయలకుంట్ల గ్రామంలోని శ్రీకాంత్‌రెడ్డి స్వగృహంలో ఆయనకు శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉల్లి వెంకట సుబ్బ య్య, కొత్తపేట జిక్రియా, ఆరిఫ్, ఉల్లి ప్రసాద్, మద్దిలేటి, చిలకల రాంపు ల్లయ్య, సారెడ్డి రామనాగిరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, సంగిరెడ్డి పుల్లారెడ్డి, నరసింహుడు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

చాగలమర్రి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో జీఎస్టీ తగ్గింపుపై తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో తాహిర్‌హుసేన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు. ఎంఈవో అనూరాధ, ఈవో తారకేశ్వరి, పీఆర్ ఏఈ కొండారెడ్డి పాల్గొన్నారు.

డోన్ రూరల్: డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ జీఎస్టీలో జరిగిన మార్పులు, ప్రయోజనాలపై ఈనెల 7న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, 8న వ్యాసరచన పోటీలు, 9న ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ పోటీలతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

బెలుం గుహల చుట్టూ తవ్వకాలు నిషేధించాలి

కొలిమిగుండ్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బెలుం గుహల చుట్టూ మైనింగ్ తవ్వకాలను నిషేధించాలని జనసేన పార్టీ బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని బెలుం గుహలను ఆయన జనసేన నాయకులతో కలిసి సందర్శించారు. జనసేన నాయకులు అజిత్, హోసన్నా, వినయ్, పక్కీరా పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఆళ్లగడ్డ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజక వర్గంలోని పలు గ్రామాల లబ్దిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సోమవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం 69 మంది లబ్దిదారులకు రూ 39,22,163ల చెక్కులను ఆయా కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే అఖిలప్రియలకు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశారు.